ప్రభుత్వ లక్ష్యం బుగ్గిపాలు!

- రోడ్లపైనే పంట వ్యర్థాలకు నిప్పు పెడుతున్న రైతులు
- వ్యర్థాలతో పాటు కాలిపోతున్న హరితహారం మొక్కలు
- చెప్పినా పట్టించుకోని రైతులు



అచ్చంపేట-పెగడబండ గ్రామాల మధ్య తగలబడిన మొక్కలు(ఫైల్)

మాగనూర్: పర్యావరణ పరిరక్షణ కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం లక్ష్యం బుగ్గిపాలవుతోంది. ఒక వైపు భారీ సంఖ్యలో మొక్కలు నాటుతుంటే, కొందరు చెట్లను నరకడం, తగలబెట్టడం వంటి పనులతో ప్రభుత్వ లక్ష్యం నిరీర్యం అవుతోంది. మగనూర్ మండలంలోని అయా గ్రామాల్లో రోడ్డు పక్కన పంట వ్యర్థాలను తగుల బెట్టడంతో పక్కన ఉన్న చెట్లకు నిప్పుతగిలి అవి కాలిపోతున్నాయి.

పంట వ్యర్థాలతోనే..

రోడ్లపై పంట దిగుబడులు ఆరబెట్టడం, నూర్పిళ్లు అక్కడనే చేయడంతో పంట దిగుబడుల వ్యర్థాలు అధికంగా వస్తున్నాయి. వాటిని కొందరు రోడ్డు పక్కనే తగుల బెడుతున్నారు. దీంతో సమీపంలో ఉండే చెట్లు తగులబడి పోతున్నాయి. తారు రోడ్డు కూడా దెబ్బ తింటోంది. మాగనూర్, వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి, కొత్తపల్లి, గురువలింగంపల్లి, తళంకేరి, వడ్వాట్, అడవిసత్యారం, కోల్పూర్, మందిపల్లి గ్రామాల్లో పలు రోడ్లపై పంట దిగుబడుల వ్యర్థాలను రోడ్డు పక్కన, రోడ్డుపై తగుల బెడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల మండల అధికారులు, ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలను నాటారు. ప్రస్తుతం చెట్లు ఎదుగుతున్నాయి. వ్యర్థాలను తగులబెట్టే క్రమంలో ఆ చెట్లు కూడా తగులబడుతున్నాయి. వ్యర్థాల నిప్పు సెగకు చెట్లు మాడి మసవుతున్నాయి.

ఎరువుగా తయారు చేసుకోవచ్చు..

పంట దిగుబడుల నుంచి వచ్చిన వ్యర్థాలను ఎరువులుగా తయారు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు అంటున్నారు. వ్యర్థాలను తగుల బెట్టకుండా పంట భూముల్లో కందకం తవ్వి అందులో వేసి నీరు పడితే మంచి ఎరువుగా తయారవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు వ్యర్థాలను తగలబెట్టి చెట్లకు, రోడ్లకు, ప్రయాణికులకు నష్టం కలిగించే బదులు ఎరువుగా తయారు చేసుకుంటే రైతులకే మేలు జరుగుతుంది.



తళంకేరి గ్రామ శివారులో తగలబడిన హరితహారం మొక్కలు(ఫైల్)

నోటీసులు ఇచ్చాం..



రైతులు పంట వ్యర్థాలను రోడ్లపై, పంట పొలాల్లో తగలబెట్టి హరితహారం మొక్కలను ధ్వంసం చేస్తున్న విషయాన్ని గమనించాం. అయితే ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్అసిస్టెంట్ల ద్వారా వారికి చెబుతున్నా మళ్లీ అదే విధంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైతే మొక్కలకు నిప్పు పెడుతున్నారో మళ్లీ వారి ద్వారానే నూతన మొక్కలు నాటిస్తాం. గతంలో కూడా అలా చేసిన వారికి నోటీసులు జారీ చేయడం జరిగింది.

– రహ్మతుద్దీన్, ఎంపీడీఓ, మాగనూర్

క్లుప్తంగా

అంబేడ్కర్ జాతర కమిటీ ఎన్నిక

ఊట్కూరు: మండలంలోని అవుసలోనిపల్లిలో ఆదివారం అంబేడ్కర్ జాతర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా భీమేష్, కోశాధికారిగా భాస్కర్, కార్యదర్శులుగా పరశురాము, ఆకాష్, నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొక్కు శంకర్, దశరథ్, నర్సింహులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు



నారాయణపేట: మైనర్లు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై, రోడ్డు భద్రత నియమాలపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, నడిపితే వాహన యజమాని (తల్లిదండ్రుల)పై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. మైనర్ వాడిన వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేయవచ్చని, 18 ఏళ్లు నిండిన తర్వాత వచ్చే లైసెన్స్ ఆలస్యం కావచ్చన్నారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలను గమనిస్తూ వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1లో సత్తాచాటిన వీణకు ఘన సన్మానం



నారాయణపేట ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన టీజీపీఎస్సీ గ్రూప్‌-1 ఫలితాలలో నారాయణపేటకు చెందిన వీణ 484.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 118వ ర్యాంక్, ఎస్టీ క్యాటగిరిలో మల్టీ జోన్‌-2లో మూడో ర్యాంక్ సాధించడం జిల్లాకు గర్వ కారణమని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా.కె.రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫౌండేషన్ సభ్యులతో కలిసి వీణను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, బాలాజీ, పోలీస్ పటేల్ మధుసూదన్ రెడ్డి, హన్మంత్, రుద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేలకొరిగిన పంటలు




మరికల్: అకస్మాతుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలో పలు గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. ఆదివారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల కన్మనూర్, మరికల్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. మరోవారం రోజుల్లో వరి కోతకు రాగా, అకాల వర్షాలు రైతులను భయపెట్టిస్తున్నాయి. పంటలను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సీసీరోడ్డు పనులకు భూమి పూజ



మక్తల్: మండలంలోని కాట్రేవ్‌పల్లి గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు పనులను మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, రూ.3 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

చింతలరాయస్వామి రథోత్సవం



నారాయణపేట ఎడ్యుకేషన్: నారాయణపేట మండలం, సింగారం గ్రామంలో శనివారం అర్ధరాత్రి చింతలరాయ స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఉద్దాల ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాలలో చివరిరోజు స్వామివారికి చక్రస్నానం, అభిషేకం, పల్లకీ సేవతో జాతర ఉత్సవాలు ముగిశాయి.

విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం



మక్తల్‌లో పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఏమాత్రం నమ్మకం లేకుండా పోయిందని, ప్రజల విశ్వాసం కోల్పోయిందని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 27న వరంగల్ జరిగే రజతోత్సవాల సందర్భంగా ఆదివారం మక్తల్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సభకు పల్లెల నుంచి భారీగా తరలిరావాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ హయాంలోనే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతోందన్నారు. వరంగల్లో చేపట్టే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్లు నర్సింహగౌడ్, రాజేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌సింగ్, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జయరాములు, రవికుమార్ యాదవ్, చి న్నహన్మంతు, ప్రతాప్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సాయిలుగౌడ్, అన్వర్, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, బండారి ఆనంద్, రఘు, నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రజతోత్సవ వాల్‌పోస్టర్ విడుదల

మరికల్: వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ వాల్ పోస్టర్‌ను రాకొండలో విడుదల చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ 27న చలో వరంగల్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రఘు, రాజేశ్వర్‌రెడ్డి, నరహరి, వెంకట్రాములు, ఆంజనేయులు, రాము, దయసాగర్, భూపతి, రాములు, హన్మన్న, సంజీవ, బాలరాజు, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ పట్టా ప్రదానం



మక్తల్: మండలంలో కర్ని గ్రామానికి చెందిన జి.పావని ఇటీవల మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ వైద్య విద్యను పూర్తి చేయడంతో ఆమెకు ఎంబీబీఎస్ పట్టాను ప్రదానం చేశారు. మారుమూల పల్లెకు చెందిన జి.పావనికి పట్టా ప్రదానం చేయడంతో పలువురు అభినందించారు. ఆమెతో పాటు తల్లిదండ్రులు మాజీ ఎంపీటీసీ చిన్నరంగప్ప, సులోచనమ్మలను ప్రత్యేకంగా అభినందించారు.

రాజీవ్ యువ వికాసం తేదీలను పొడగించాలి

నారాయణపేట ఎడ్యుకేషన్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తు ప్రక్రియల్లో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్న కారణంగా ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలను పొడిగించాలని డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయులు కోరారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు నరహరి మాట్లాడారు. సర్వర్ లోపాలు, సాంకేతిక సమస్యల కారణంగా ఇంటర్‌నెట్, మీ సేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారన్నారు. మంగళవారంతో ముగియనున్న దరఖాస్తు గడువుతో నిరుద్యోగులు సర్వర్ల ఇబ్బందుల కారణంగా దరఖాస్తు చేసుకోలేదని, ప్రభుత్వం గడువు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, డీవైఎఫ్‌ఐ నాయకులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.


ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



టీఎస్‌యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు శివరాములు

నారాయణపేట ఎడ్యుకేషన్/కోస్గి రూరల్: టీఎస్‌యూటీఎఫ్ 12వ ఆవిర్భావ దినోత్సవం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మండల వనరుల (ఎమ్ఆర్‌సీ) ఆవరణలో సీనియర్ నాయకలు లాంగడే లక్ష్మణ్ జెండాను ఆవిష్కరించారు. కోస్గి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ జెండాను సంఘం జిల్లా అధ్యక్షులు శివరాములు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులందరికి ఒకే సంఘం అనే చారిత్రక అవశ్యకతతో ఆవిర్భవించిందన్నారు. మహనీయుల త్యాగాల వారసత్వంలో ప్రభుత్వ విద్య అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ ఉపాధ్యాయుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్‌నాయక్, కోస్గి, గుండుమాల్ అధ్యక్షులు శ్రీరాములు, సాయప్ప, మల్లికార్జున్, గౌరప్ప, ఉమామహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, కిష్టయ్య, నరేష్ ఉన్నారు.

పేదలకు సన్నబియ్యం పంపిణీ



మక్తల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని మాజీ సర్పంచ్ మణివర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆశిరెడ్డి అన్నారు. ఆదివారం మక్తల్ మండలం పారేవులలో రేషన్ బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుర్వరాజు, కమ్మరి కృష్ణ, గోపాల్, లింగప్ప, ముష్టి గోపాల్, ఎరుకలి రాజు, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజం కోసం పోరాడుదాం



క్రీడలు ప్రారంభిస్తున్న నర్సింహులు

మద్దూరు: జార్జిరెడ్డి 53వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని ఖాజీపూర్‌లో క్రీడలు నిర్వహించారు. ఈ పోటీలను సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కొండా నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు విశ్వవిద్యాలయాల్లో అరాచకులు చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేసిన జార్జిరెడ్డి, కులమత భేదాలు లేని సమాజం కోసం పోరాటం చేశాడన్నారు. నూతన సమాజాన్ని నిర్మించడం కోసం నేటి యువతరం ఆలోచించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్, పీవైఎల్ జిల్లా నాయకులు కాశీనాథ్, బీమేశ్, కార్తిక్, నాగరాజు, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీ నుంచి గల్లీ వరకు మోదీ పథకాలు



మక్తల్: భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ఢిల్లీ నుంచి గల్లీ వరకు చేరుతాయని మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి ఆదివారం మక్తల్ మండలం పంచలింగాలలో 'మేర గాం చలో'.. బస్తీ చలో' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో బీజేపీ జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్నిస్వామి, ద్యావరింటి నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బిజ్వార్‌లో అంబత్రయ క్షేత్రంలో క్రీడాకారులను సన్మానిస్తున్న ఆదిత్యపరాశ్రీ

ఊట్కూరు: విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ఆదిత్యపరాశ్రీ అన్నారు. ఆదివారం బిజ్వార్‌లోని అంబత్రయ క్షేత్రంలో రిటైర్డ్ పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన సైక్లింగ్ టోక్రో సూటింగ్ బాల్ క్రీడాకారినులు, క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. వారికి ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆదిత్యపరాశ్రీ స్వామిజీ మాట్లాడుతూ రిటైర్డ్ పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో సుమారు 60 మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడారంగంలో రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. క్రీడల వల్ల పట్టుదల, ఏకాగ్రత, మానసిక, శారీరక పెరుగుదల ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభను అనుసరించి తల్లిదండ్రులు క్రీడారంగంలో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు సత్యాంజనేయులు, రమేష్‌కుమార్, భాస్కర్, మహేష్‌గౌడ్, కృష్ణయ్య, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాల పోస్టర్ విడుదల



అగ్నిమాపక శాఖ వారోత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం మక్తల్ పట్టణంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పోస్టర్ విడుదల చేశారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 తేదీ వరకు వారోత్సవాలు ఉంటాయని తెలిపారు. మక్తల్‌కు ఫైర్‌స్టేషన్, నూతనంగా టెక్నాలజీతో కూడిన వాహనం వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. వారోత్సవాల్లో భాగంగా అందరికి అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కట్ట సురేష్, వైస్ చైర్మన్ గణేష్ కుమార్, గోవర్ధన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం



వేంకటేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న సీఐ, పోలీస్ సిబ్బంది

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున శ్రీ స్వయంభు లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు పాల ఉట్టిని పగులగొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భజన మండలి చేత భజన గీతాలు ఆలపించారు. ఈ ఉత్సవాలకు మన రాష్ట్ర ప్రజలే కాక, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకోనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహకులు తాగునీరు, వసతి సౌకర్యం, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

రథోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే

వేంకటేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు బీఆర్‌ఎస్ నాయకులు ఆశిరెడ్డి, శివరాజ్‌పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో మాజీ ఎమ్మెల్యేలు

మండలంలోని గుడెబల్లూర్ స్వయంభు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం పాలఉట్టి కార్యక్రమానికి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతాదయాకర్‌రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా సీతాదయాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, రవీందర్, వేణు, గుండప్ప, బీజేపీ నాయకులు సోమశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ లింగయ్య

కొత్తపల్లి: మండలంలోని తిమ్మారెడ్డి పల్లిలో వెలసిన గురులోకామసంద్ బావాజీ బ్రహ్మోత్సవాల సందర్భంగా భద్రత ఏర్పాట్లను నారాయణపేట డీఎస్పీ లింగయ్య పరిశీలించారు. పోలీసు అధికారులకు భద్రత పరమైన సూచనలు చేశారు. ఆదివారం తెల్లవారు జామున జరిగిన రథోత్సవ కార్యక్రమం ప్రశాంతంగా జరిగిందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. జాతరలో దొంగతనాలు జరగకుండా మఫ్టీలో పోలీసులను ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర సమయంలో ప్రజలకు అందుబాటులో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు, ఎలాంటి అత్యవసర సమయంలో 100 డైల్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సైదులు, మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ మాయలో పడొద్దు



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న

నారాయణపేట: ఆధిపత్య కుల పార్టీ లైన బీజేపీ, కాంగ్రెస్‌ల మాయలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలు పడొద్దని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ అధ్యక్షతన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బహుజన ప్రజల ఆత్మగౌరవం బీఎస్పీతోనే సాధ్యమని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకే నాణేనికి రెండు ముఖాలన్నారు. నిరంతరం బలహీన వర్గాల ప్రజలను ఉచిత పథకాల పేరుతో మోసం చేస్తూ, ఆధిపత్య వర్గాలకు అధికారం ఇస్తున్నాయన్నారు. బహుజనుల జీవితాల్లో మార్పు రావాలంటే బీఎస్పీ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి బండారి చంద్ర శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్ల నరేందర్, మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు తిరుపతి, నారాయణపేట అసెంబ్లీ అధ్యక్షులు హన్మంతు, కార్యదర్శి సందుల రాజు, ప్రధాన కార్యదర్శి శివ కుమార్, కోశాధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని బైక్ ర్యాలీ



సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేస్తున్న నాయకులు

నారాయణపేట/మక్తల్: సామాజిక సమానత్వం సాధించాలని, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని కోరుతూ ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నారాయణపేట మండలంలోని గడ్డమీద అప్పక్‌పల్లి నుంచి జిల్లా కేంద్రదానికి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాంలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 14 వరకు తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయ సాధన క్యాంపియన్ నిర్వహించాలని సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. జిల్లాలో వివిధ మండలాల నుంచి సామాజిక సమానత్వ కోసం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. బైక్ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జోషి, బాలమణి, కాశీనాథ్, డి.కృష్ణయ్య, భీంసేన్, భీమేష్, మొగులయ్య, నరహరి, పవన్ కుమార్, రాములు, దస్తప్ప పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ



నారాయణపేట ఎడ్యుకేషన్: నారాయణపేట మండలం సింగారంలో ఆదివారం క్రైస్తవులు మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మట్టలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఇమ్మెనియేల్ చర్చిలో రెవరెండ్ పాస్టర్ నగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు ప్రభువు ఇదే రోజున యెరుషలెమ్ వెళ్లినప్పుడు అక్కడ ప్రజలు యేసయ్యను స్మరిస్తూ మట్టలతో స్వాగతం పలికి యెరుషలెమ్ తీసుకెళ్లారని, దాని జ్ఞాపకంగా మట్టలతో ఆదివారం ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.